క్లుప్తంగా

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ లావణ్య

పాతపట్నం: విద్యార్థులు జీవితంలో చక్కటి లక్ష్యాలను ఎంచుకోవాలని ఎస్‌ఐ బి.లావణ్య అన్నారు. మండలంలోని సింగుపురం, గురండి ఎంపీపీ పాఠశాలలో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ కార్యాక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు స్నేహంగా మెలగాలన్నారు. చిన్నారులకు ఎదురయ్యే సమస్యలు తెలుసుకోవాలన్నారు. అసభ్య ప్రవర్తన గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సారవకోట, గొర్రిబంద, జగ్గయ్యపేట, బురుజువాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఈ–శ్రమ్‌లో రిజిస్ట్రేషన్ చేయండి



మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ అధికారి కొండలరావు

పొందూరు: శ్రామికులందరినీ ఈ–శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని అసిస్టెంట్ లేబర్ అధికారి బి.కొండలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సహాయకులతో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ–శ్రమ్‌లో నమోదు చేసుకున్న వారికి పాక్షిక అంగవైకల్యానికి గురైతే రూ.లక్ష , శాశ్వత అంగవైకల్యానికి గురైతే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు పొందవచ్చునన్నారు. 16 ఏళ్ల వయస్సు నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న శ్రామికులందరికీ ఈ–శ్రామ్‌లో రిజిస్ట్రేషన్ చేయవచ్చునన్నారు. ఎంపీడీఓ ఎం.మన్మధరావు, ఏపీఓ శ్రీనివాస్, పీఆర్ ఏఈ అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేయడం తగదు

- డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న

పొందూరు: ఉపాధ్యాయుల హాజరు విషయంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారుల తీరు ఆందోళనకు గురిచేస్తోందని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న అన్నారు. పొందూరులో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠశాలకు సకాలంలో హాజరైనప్పటికీ ఫేసియల్ అటెండెన్స్ యాప్ సరిగా పనిచేయడం లేదన్నారు. ఇంటికి సకాలంలో చేరాలనుకున్న మహిళా ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఫిబ్రవరి 15వ తేదీన జరిగిన పాఠశాల సముదాయం సమావేశంలో కూడా యాప్ పనిచేయలేదన్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల వరకు కావాలనే ఉపాధ్యాయులను పాఠశాలల్లో ఉంచారన్నారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని ఉపాధ్యాయులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా యాప్‌లో ఉన్న లోపాలను సవరించి సరైన సమయంలో హాజరుపడేలా చర్యలు తీసుకోవాలని, బోధనపైనే ఉపాధ్యాయులు దృష్టి కేంద్రీకరించేలా సహకరించాలని కోరారు.

శివరాత్రి ఉత్సవాలు సజావుగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో సజావుగా నిర్వహించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం శ్రీముఖలింగంలో ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. భక్తులకు స్వామివారి దర్శన సమయంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఒడిశా నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న దృష్ట్యా సౌకర్యాలు కల్పించాలన్నారు. స్వామివారి చక్ర తీర్థ స్నానాల రోజు భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈఓ ప్రభాకరరావు, ఈఓపీఆర్డీ ఉమా మహేశ్వరరావు, సర్పంచ్ టి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

మిగులు ధాన్యం కొనేదెప్పుడు?

- పలుచోట్ల కళ్లాలు, పొలాల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు
- ప్రతిపాదనలకే పరిమితం
- అదుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

నరసన్నపేట నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు (మెట్రిక్ టన్నులు), ప్రతిపాదనల వివరాలు ఇలా..

మండలం	కొనుగోలు చేసినవి	ప్రతిపాదనలు
నరసన్నపేట	23,280	7,100
పోలాకి	22,157	6,200
జలుమూరు	29,500	7,600
సారవకోట	22,600	5,400



బాడాం వద్ద కల్లంలో ఉన్న ధాన్యం నిల్వలు

నరసన్నపేట:

ఆరుగాలం శ్రమించి ప్రజలకు తిండి గింజలు అందించే రైతులు ధాన్యాన్ని అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. పండించిన ధాన్యం అమ్ముడు కాక, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నరసన్నపేట నియోజకవర్గ రైతులు కన్నీరు పెడుతున్నారు. పండిన ధాన్యం కళ్ల ముందే ఎలుకలు తినేస్తుంటే వాటిని దాచుకోలేక కన్నీరు పెడుతున్నారు. ధాన్యం అమ్ముకానికి వందల బస్తాలు ఉన్నా.. మండల స్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు రైతుల దైన్య స్థితిని జిల్లా అధికారులకు తెలియజేస్తున్నా వారు పట్టించుకోవడం లేదు. ఫలితంగా పొలాలు, కళ్లాల్లోనే ధాన్యం నిల్వలు వారాల తరబడి కనిపిస్తున్నాయి. సంక్రాంతి ముందు నుంచి ఇదే పరిస్థితి. చర్యలు తీసుకోవాల్సిన జిల్లా అధికారులు చోద్యం చూస్తున్నారు. గత సీజన్ కంటె ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చింది. దీంతో లక్ష్యం పెంచాల్సింది పోయి తిరిగి తగ్గించి కొనుగోలు చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. నరసన్నపేట మండలంలో గత సీజన్లో 27,900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 23,280 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. ఇంకా ధాన్యం నిల్వలు 7 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఉన్నాయి. జలుమూరు, పోలాకి, సారవకోట మండలాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

రైతులపై కక్ష తగదు



ధాన్యం కొనుగోలు చేయడానికి అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. గ్రామ స్థాయిలో ఉన్న సిబ్బంది మండల అధికారులపైన, మండల అధికారులు జిల్లా అధికారులపైన నెడుతున్నారు. సంక్రాంతి ముందు నుంచి ఇదే పరిస్థితి. ధాన్యం కొనుగోలు మాత్రం జరగడంలేదు. గ్రామాల్లో వందలాది బస్తాల ధాన్యం ఉన్నాయి.

– దోల గోవిందరావు, రైతు, బాడాం, నరసన్నపేట

ఆందోళనలో రైతన్నలు

ఆమదాలవలస నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు(మెట్రిక్ టన్నులు) వివరాలు

మండలం	కొనుగోలు చేసినవి	ప్రతిపాదనలు పంపినవి
ఆమదాలవలస	15,500	5,000
పొందూరు	6800	6,500
సరుబుజ్జిలి	13,616	3,600
బూర్జ	16,200	5,800



ఆమదాలవలస మండలం కామిరెడ్డిపేటలో కళ్లంలో ఉన్న ధాన్యం బస్తాలు

ఆమదాలవలస: నియోజకవర్గంలోని ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆగిపోయింది. దీంతో రైతులు నానా ఇక్కట్లు పడుతున్నారు. కళ్లాలు, పంట పొలాల్లో ధాన్యం బస్తాల నెట్టులు వేసి కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ లేని ఇబ్బంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీడి బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పాతపట్నం: జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న అన్నారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు జీడీ రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మక అప్పన్న మాట్లాడుతూ జీడి పిక్కల (80 కేజీల) బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించి, రైతు సేవా కేంద్రాలు, గిరిజన కార్పొరేషన్, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీడీ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి, జీడి పంట విస్తరణ, నిర్వహణకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్.ఆదినారాయణ, ఎస్.సుంకయ్య, ఎస్.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకుమారి

పాతపట్నం: సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.కరుణాకరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సెక్రటరీలు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. ప్రజలతో బాధ్యతాయుతంగా మెలగాలని, ప్రతి ఒక్కరికీ సంతృప్తికర సమాధానం ఇవ్వాలన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సీతారాం, ఈఓపీఆర్డీ వెంకటరావు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్



రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆమదాలవలస రూరల్: రీ సర్వేతో దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలకు చెక్ పెట్టవచ్చునని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం మండలంలోని రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని రీ సర్వే పైలట్ విలేజ్ ఆనందపురాన్ని సందర్శించారు. సర్వేలోని లోటుపాట్లును రైతులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మా కలెక్టర్ మాట్లాడుతూ భూ సర్వే తో రైతులకు మేలు కలగుతుందన్నారు. ఆనందపురానికి వెళ్లే రహదారి రాళ్లు తేలి ఉండటంతో అధికారులను ప్రశ్నించారు. మార్గమధ్యంలో చెక్‌డ్యామ్ ఉందని, ఇరిగేషన్‌కు సంబంధించిన సమస్య ఉండడంతో రహదారి పనులు నిలిచిపోయాయని కలెక్టర్ దృష్టికి అక్కడి ప్రజలు, అధికారులు తీసుకువచ్చారు. సమస్యను పరిష్కరించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు.

ఈ పంట నమోదుతో మేలు

టి.జొన్నవలస సచివాలయ పరిధిలోని సంతకొత్తవలస రెవెన్యూ గ్రామంలో రబీ ఈ–పంట వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఈ క్రాప్‌ను పరిశీలించారు. వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాథస్వామి, ఏడీ బగ్గు రజని, తహసీల్దార్ ఎస్.రాంబాబు, మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహన్‌రావు, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, ఆర్ఐ పి.గోవిందరావు, ఏఈఓ మెట్ట సాయి దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామక ప్రక్రియ పూర్తయింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. యూత్ వింగ్–రావాడ పాపారావు, మహిళా విభాగం–కాగాన సుశీల, రైతు విభాగం– నిమ్మగడ్డ కృష్ణమూర్తి, బీసీ సెల్–అగతముడి నాగేశ్వరరావు, ఎస్సీ సెల్–అలికాన మాధవరావు, ఎస్టీ సెల్–సవర సింహాద్రి, మైనార్టీ సెల్–షేక్ చంద్, క్రిస్టియన్ మైనార్టీ సెల్–సియాకు రాజారావు, విద్యార్థి విభాగం–రాయి కోటి, పంచాయతీ రాజ్–సీపాన అశోక్ కుమార్, ఆర్టీఐ వింగ్–ఎనుగుతల సూర్యానారాయణ, వాలంటీర్స్ వింగ్–బూరాడ నాగరాజు, గ్రీవెన్స్ సెల్–నక్క ఆనందరావు, వాణిజ్య విభాగం–బోను గిరి, వీవర్స్ వింగ్–ఎర్ర ఈశ్వరరావు, వైఎస్సార్ టీయూసీ–నెయ్యిల బాలకృష్ణ, అంగన్‌వాడీ వింగ్–అంపిలి బుచ్చిబాబు, లీగల్ సెల్–నక్క బాబూరావు, కల్చరల్ వింగ్–పద్ద నేతాజీ, సోషల్‌మీడియా వింగ్–పడపతి తేజేశ్వరరావు, ఐటీ వింగ్–సవర వెంకటేష్, దివ్యాంగుల విభాగం–పెద్దకోట రాము, డాక్టర్స్ వింగ్–ఎర్ర జనార్దనరావు, పబ్లిసిటీ వింగ్– లుకలాపు శ్రీనివాసరావు, బూత్ కమిటీస్–పంకజ్ కుమార్ దాస్, ఇంటిలెక్టువల్స్ ఫోరం అధ్యక్షుడిగా కొండాల అర్జునుడు నియామకమయ్యారు.

రూ.10 వేల అపరాధ రుసుం విధింపు

పాతపట్నం: మండలంలోని భగంతర గ్రామ సమీపంలోని కొండను అక్రమంగా (కంకర, మట్టి) తవ్వుతుండగా ఆర్ఐ పండిత బాబీ ఈ నెల 18వ తేదీన జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. వాల్టా యాక్ట్ కింద అపరాధ రుసుం రూ.10 వేలు విధించినట్లు తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. మైన్స్, రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా మట్టి, కంకర అక్రమంగా తవ్వితే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బోర్డు బంగ్లా వద్ద రాద్ధాంతం

- అధికారులు కట్టిన గోడ తొలగింపు
- అప్రమత్తమైన అధికారులు, పోలీసులు



బోర్డు బంగ్లా వద్ద ఎంపీడీఓ, ఎస్ఐలతో వాగ్వాదం చేస్తున్న ప్రైవేట్ వ్యక్తులు

నరసన్నపేట: స్థానిక బజారు వీధి వద్ద ప్రభుత్వానికి చెందిన విలువైన బోర్డు బంగ్లా స్థలం వద్ద గురువారం రాద్ధాంతం జరిగింది. స్థలం చుట్టూ అధికారులు కట్టిన గోడను ఆమదాలవలసకు చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా తొలగించారు. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎంపీడీఓ మధుసూదనరావు.. పంచాయతీ సిబ్బందితో కలిసి బోర్డు బంగ్లా స్థలం వద్దకు చేరుకున్నారు. అప్పటికే జేసీబీతో మట్టిని సదును చేస్తుండటంతో వివాదం చోటుచేసుకుంది. వెంటనే ఎస్ఐ దుర్గాప్రసాద్ తన సిబ్బందితో వచ్చి పనులను అడ్డుకున్నారు. స్థలం తమ పేరున ఉంది. కోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయని పోలీసులు, అధికారులతో వాదనకు దిగారు. ఈ స్థలం ప్రభుత్వానికి చెందినది ఇతరుల జోక్యం వద్దని పోలీసులు గట్టిగా హెచ్చరించడంతో ఘర్షణ తాత్కాలికంగా సద్దు మణిగింది. తహసీల్దార్ ప్రస్తుతం గ్రామంలో లేనందున ఈ రోజుకు పనులు నిలిపివేయాలని, శుక్రవారం రికార్డులు పరిశీలించిన తరువాత తదుపరి చర్యలకు వెళ్తామని ఎంపీడీఓ తెలిపారు.

మరోసారి వివాదం..

2023 అక్టోబర్ 21, డిసెంబరు 16వ తేదీల్లో ఇదే స్థలం వద్ద వివాదం నెలకొంది. శిథిల ప్రభుత్వ భవనాన్ని కొందరు తొలగించి వ్యర్థాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నప్పుడు గమనించిన స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓలు ఇది ప్రభుత్వ స్థలంగా బోర్డులు పెట్టారు. స్థలానికి రక్షణగా ప్రభుత్వ నిధులతో గోడను నిర్మించారు. మళ్లీ వివాదం నెలకొనడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ స్థలానికి కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించారని ఎంపీడీఓ అభిప్రాయపడుతున్నారు. ఈ తప్పుడు పత్రాలతో కోర్టుల నుంచి అనుమతులు పొంది విలువైన ప్రభుత్వ స్థలం కాజేయడానికి చూస్తున్నారన్నారు. ఈ స్థలం 40 ఏళ్ల క్రితం నుంచి ప్రభుత్వ ఆధీనంలో ఉందని, ప్రైవేట్ వ్యక్తులకు సంబంధం లేదన్నారు ఈ మేరకు కోర్టుకు తెలియజేశామన్నారు. మరోవైపు తమ వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు, లింకు డాక్యుమెంట్లు ఉన్నాయని ప్రైవేట్ వ్యక్తులు వాదిస్తూ కోర్టు నుంచి వచ్చిన మధ్యంతర ఉత్తర్వుల పత్రాలను అధికారులకు చూపారు. దీంతో అధికారులు ఆలోచనలో పడ్డారు. గొట్టిపల్లి రెవెన్యూలో 219–బీ వన్ సర్వే నంబర్‌లో ఉన్న 38 సెంట్లు ప్రభుత్వానిదని ఎంపీడీఓ స్పష్టం చేశారు.

జగనన్నను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ధర్మాన కృష్ణచైతన్య



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో దుంపల రామారావు

పార్వతీపురం మన్యం జిల్లాకు గురురవారం వచ్చిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహనరెడ్డిని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, పార్టీ కాళింగ కుల రాష్ట్ర చైర్మన్ దుంపల రామారావు మర్యాద పూర్వకంగా కలిశారు. నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేతను వీరితోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కలిశారు. – నరసన్నపేట, ఆమదాలవలస

చల్లదనం..



కొత్తూరు మండలంలోని బలద గ్రామంలో చెవిటమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరుగుతన్న ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ముర్రాటలతో తిరువీధి చేపట్టారు. కుంకుమార్చనలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– కొత్తూరు

పరిశీలన



ఉపాధి పనుల్లో వేగం పెంచాలని, నాణ్యతలో ఏమాత్రం తేడా ఉన్నా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లే బాధ్యత వహించాలని డ్వామా పీడీ బి.సుధాకర్ అన్నారు. నరసన్నపేట మండలంలోని దేవాది వద్ద ఉపాధి ద్వారా చేపడుతున్న మబగాం ఓపెన్ హెడ్ చానల్ పనులను గురువారం పరిశీలించారు. పనులు చేపట్టే ముందు పని ప్రదేశాన్ని పరిశీలించాలన్నారు. తీర్మానంలో లేని పనులు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నరసన్నపేట ఏపీఓ యుగంధర్, మండల ఇంజినీర్ అప్పలరాజు, తదితరులు ఉన్నారు.

– నరసన్నపేట

కూలేందుకు సిద్ధంగా..



మెళియాపుట్టి మండలంలోని కరజాడ గ్రామంలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన తాగునీటి ట్యాంక్ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. రానున్నది వేసవికాలం కావడంతో ట్యాంక్ కూలిపోతే తాగునీటికి అవస్థలు తప్పవని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. 2 వేల మంది పైచిలుకు జనాభా ఉన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లామని, సమస్య పరిష్కారానికి కృషిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– మెళియాపుట్టి

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం ఆలయంతోపాటు పరిసరాల్లో గురువారం పంచాయతీ విస్తరణ అధికారి చల్ల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆలయం చుట్టుపక్కలతోపాటు వీధులన్నీ శుభ్రం చేశారు. యంత్రాలతో వ్యర్థాలను తొలగించారు. సర్పంచ్ టి.సతీష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

– జలుమూరు

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ సుధాకర్

పోలాకి: ఉపాధి హామీ పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని డ్వామా పీడీ సుధాకర్ హెచ్చరించారు. గురువారం పోలాకి మండలం రాళ్లపాడులో జరుగుతున్న రింగ్ ట్రెంచ్ పనులను పీడీ పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న మట్టితీసే పనులను గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ఏపీఓ రమణ, ఈసీ మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో ప్రాధాన్యత కల్పించాలి

జలుమూరు: త్వరలో ప్రకటించనున్న డీఎస్సీలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రాధాన్యతా మార్కులు కల్పించాలని సీఆర్‌ఎంటీ యూనియన్ ప్రతినిధి పట్ట వైకుంఠరావు కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. సమగ్ర శిక్షలో సీఆర్‌ఎంటీ, ఎంఐఎస్, డీటీపీ, ఐఈఆర్‌టీ,అకౌంట్స్, పీఈఆర్‌టీ, మెసంజర్స్ ఇలా వివిధ భాగాల ఉద్యోగులు గత 13 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. కనీస వేతనాలు లేక అవస్థలు పడుతున్నామన్నారు. మెగా డీఎస్సీలో వెయిటేజీ మార్కులు కేటాయించడం వల్ల చాలా మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

బూర్జ: మండలంలోని సింగన్నపాలెం గ్రామానికి చెందిన మహిళ గురువారం 15 మద్యం సీసాలతో లచ్చయ్యపేట జంక్షన్ వద్ద పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి ఆమదాలవలస కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ ఎం.ప్రవల్లిక తెలిపారు. మద్యంతో పట్టుబడితే చర్యలు తీసుకుంటామన్నారు.